క్లుప్తంగా

ముమ్మరంగా వ్యవసాయ పనులు



పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

ఇంద్రవెల్లి: వానాకాలం సీజన్ సమీపిస్తుండడంతో మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. దుక్కి దున్నడం, పత్తి కట్టెలు తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు. సాగునీరు వసతి ఉన్న రైతులు బుధవారం ముందస్తుగానే పత్తి విత్తనాలు నాటారు.

బస్‌షెల్టర్ నిర్మాణం



అనిల్ నిర్మించిన బస్‌షెల్టర్

బోథ్: మండల కేంద్రానికి చెందిన మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అనిల్ కుమార్ గురువారం రాఘవేంద్ర జిన్నింగ్ ఫ్యాక్టరీ వద్ద బస్‌షెల్టర్ నిర్మించారు. ఆదర్శ పాఠశాల, కస్తూరిబా పాఠశాల విద్యార్థులు ప్రతీరోజు ఎండలో నిలబడాల్సి వస్తోందని, వారి సౌకర్యార్థం కోసం బస్సుషెల్టర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పాలిక్ రమేశ్, పూంద్రు రాకేశ్‌రెడ్డి, మెరుగు సాయి, సాయి రోహిత్, రాము, అరవింద్, ముత్యం, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

బెంచీల ఏర్పాటు

బోథ్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కస్తూరిబా పాఠశాల, గురుకుల బాలికల పాఠశాల విద్యార్థుల కోసం 1992– 93 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆలంబన వెల్ఫేర్ సొసైటీ ద్వారా బెంచీలు ఏర్పాటు చేశారు. అలాగే సైనిక్ యూత్ సభ్యులు తమ స్నేహితుడు గుమ్ముల జశ్వంత్ జ్ఞాపకార్థం బెంచీలు అందజేశారు. పాఠశాలలు ప్రారంభమవుతున్న సందర్భంగా విద్యార్థుల సౌకర్యార్థం బెంచీలు అందజేసినట్లు తెలిపారు. ఆలంబన సొసైటీ సభ్యులు, సైనిక్ యూత్ సభ్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు



బురదగా మారిన రోడ్డు

నేరడిగొండ: మండలంలోని తేజాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఓ పక్కన ఇంటర్నెట్ పేరిట ఫైబర్‌గ్రిడ్ కోసం తవ్వకాలు చేపట్టడంతో తారు రోడ్డు మట్టి రోడ్డుగా మారింది. దీంతో రాకపోకలకు వాహనదారులకు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా జాన్సన్ నాయక్ జన్మదిన వేడుకలు

ఉట్నూర్‌రూరల్: బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ జన్మదిన వేడుకలు బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని వికాసం ప్రత్యేక పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్ కట్‌చేసి, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కాటం రమేశ్, సాడిగే రాజ్‌కుమార్, దూట మహేందర్, సోనేరావు, ముజీబ్, గిరి, సాజిద్, పాండురంగ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు కొనేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఏఈవో గణేశ్

కుంటాల: రైతులు విత్తనాలు కొనేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఏఈవో గణేశ్ కోరారు. గురువారం మండలంలోని విఠాపూర్‌లో ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశంలో నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. పంట దిగుబడి వచ్చే వరకు కొనుగోలు రశీదు భద్రపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో గట్టుపల్లి నవీన్, పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన 'బడిబాట'

- ర్యాలీ నిర్వహించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు



బోథ్: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది, విద్యార్థులు

బోథ్: మండల వ్యాప్తంగా బడిబాట ప్రారంభమైంది. మండల కేంద్రంతో పాటు కౌఠ(బి), కుచులాపూర్, సొనాలతో పాటు పలు గ్రామాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ బడిలోనే పిల్లలను చేర్పించాలని కోరారు. కౌఠ(బి)లో ప్రధానోపాధ్యాయులు శశిధర్ రెడ్డి, ఉపాధ్యాయులు గంగయ్య, రాజేశ్వర్, గౌస్, నరేశ్, నవనీత్, పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్, బీఎల్‌వో శాంతిశ్రీ,, వెండి సోమేశ్వర్, కుచులాపూర్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, రజిత, అంగన్‌వాడీ కార్యకర్త సల్ల కళావతి, పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ టి. ప్రేమలత పాల్గొన్నారు.

తాంసి: ప్రతీ విద్యార్థిని విధిగా పాఠశాలలకు వెళ్లేలా చూడాలని భీంపూర్ ఎంపీడీవో గోపాలకృష్ణా రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదట విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో బడిబాట ప్రతిజ్ఞ చేశారు. ప్రతిఒకరిని పాఠశాలలో చేర్పించాలని ఇంటింటా తిరుగుతూ సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్, మహేశ్వర్‌రావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పద్మ, ఉపాధ్యాయులు శంకర్, జ్యోతి, వికేష్, తదితరులు పాల్గొన్నారు.

జైనథ్: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు కాన్ప మేడిగూడ(ఆర్) పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యవాన్ చిక్టే అన్నారు. గురువారం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బడీడు పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలన్నారు. పోషకులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొనిగెల నారాయణ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జైనథ్‌లో బడిబాట..

మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు మద్ది లస్మన్న మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు మోజులో పడి డబ్బు వృథా చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొడిచర్ల సుదర్శన్, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌రూరల్: మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

తలమడుగు: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంపీడీవో శేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల, ఎంపీపీఎస్ పాఠశాలల ఆధ్వర్యంలో గురువారం బడిబాట నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలోని వసతులను వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. గ్రామ వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రావ్, రమణ, వినోద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ, పంచాయతీ కార్యదర్శి అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలో గురువారం బడిబాట ప్రారంభించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులు చిన్నారుల తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. గురువారం బడిబాట సందర్భంగా సాథ్‌నంబర్, అడేగామ(కె), ఇచ్చోడ పాఠశాలలను సందర్శించి బడి బాట ర్యాలీలో పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు గ్రామాల్లో పర్యటించి బడీడు పిల్లలను బడిలో చేర్పించే విధంగా కృషి చేయాలని కోరారు. బోరిగామ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ, మహిళ సమైఖ్య గ్రూపులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్, ఉపాధ్యాయుడు శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడ: సాథ్‌నంబర్‌లో..



తాంసి: పిప్పల్‌కోటిలో..



జైనథ్: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



తలమడుగు: పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆడపిల్లలు బడి మానకుండా చూడాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయన్న

బేల: ఆడపిల్లలు బడి మానకుండా చూడాలని జిల్లా డీఆర్‌డీవో సాయన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో బేల జెడ్పీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల్లో శిక్షణ లేని ఉపాధ్యాయులు ఉంటారని, ప్రభుత్వ పాఠశాలల్లోనే మంచి నిష్ణతులైన ఉపాధ్యాయులు ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కోల నర్సింలు, ఉపాధ్యాయులు మనోజ్ చంద్ర సేన్, చంద్రశేఖర్, జయశంకర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తొందరపడి విత్తనాలు వేయవద్దు



అవగాహన కల్పిస్తున్న ఏఈవో శివకుమార్

తాంసి: రైతులు తొందరపడి విత్తనాలను వేయవద్దని ఏఈవో శివకుమార్ సూచించారు. గురువారం తాంసి మండలంలోని కప్పర్ల గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. పంటచేనులో రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వర్షాలు కురిసిన వెంటనే విత్తనాలు విత్తుకోవాలన్నారు. భూమిలో తేమశాతం తగ్గి విత్తనాలు మొలకెత్తవని సూచించారు. తొందరపడి విత్తనాలు వేసి నష్టపోవద్దన్నారు.

రిమ్స్ డైరెక్టర్‌కు సన్మానం



సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌కు ఉత్తమ కాలుష్యరహిత అవార్డు దక్కడంపై రిమ్స్ వైద్యులు, సిబ్బంది రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను గురువారం సన్మానించారు. ఈసందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ.. అందరి సహకారంతో రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి కాలుష్య రహిత అవార్డు దక్కిందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రిమ్స్ ఏడీ విజయ, అశ్విన్, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వీల్‌చైర్ వితరణ

ఇంద్రవెల్లి: బీఆర్‌ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం మండల బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వ ఆసుపత్రికి వీల్ చైర్ వితరణ చేశారు. ముందుగా కేక్‌కట్ చేసి, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రోగుల సౌకర్యార్థం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వీల్‌చైర్ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, మీర్జా జీలానిబేగ్, శివాజీ, జాదవ్ లక్కన్, కోరెంగా శ్రీనివాస్, గేడం భారత్, మడావి భీంరావ్, బాల్‌సింగ్ పాల్గొన్నారు.

రైతు చైతన్యం ఏది?



నాసిరకం విత్తనాలను పరిశీలిస్తున్న ఏవో (ఫైల్)

- అటకెక్కిన మన తెలంగాణ.. మన వ్యవసాయం
- వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు

తలమడుగు: పంటల సాగుపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహించే రైతు చైతన్య యాత్రలు నాలుగేళ్లుగా నిర్వహించడం లేదు. దీంతో పంటలపై రైతులకు అవగాహన కొరవడింది. నకిలీ విత్తనాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూసార పరీక్షలు, ఏ పంటలు వేయాలి, అధిక దిగుబడి సాధించేందు మేలకువలపై అవగాహన కల్పించకపోవడంతో అన్నదాతలు నష్టపోతున్నారు. మరో వారం రోజుల్లో వానాకాలం సాగు ప్రారంభం కానుండగా ప్రభుత్వం రైతు చైతన్య యాత్రల గురించి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. తలమడుగు మండలంలో దాదాపు 12 వేల ఎకరాలలో పత్తి సాగు, 9వేల ఎకరాలలో సోయాబీన్, జొన్న సాగు చేస్తున్నారు. రైతు చైతన్య యాత్రల పేరిట గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. సంబంధిత అధికారులు వీటిపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా ఏ పంట సాగు చేయాలి, ఏ విత్తనాలు నాటుకోవాలో తెలియక మూస పద్ధతిలోనే రైతులు పత్తి, సోయాబీన్, జొన్న, కంది పంటలు సాగు చేస్తున్నారు.

సూచనలు పాటించాలి

గతంలో మన తెలంగాణ.. మన వ్యవసాయం పేరిట రైతు చైతన్యయాత్ర నిర్వహించడం జరిగింది. ప్రస్తుతం అలాంటివి నిర్వహించడం లేదు. గ్రామాల్లో అందుబాటులో ఉండి రైతు వేదికలు రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుంది. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఏవో, మహేందర్, తలమడుగు

గతంలో అవగాహన సదస్సులు..

గతంలో తెగుళ్ల బెడద సోకి పత్తి, సోయా పంటలతో రైతులు నష్టపోయారు. గతంలో మన తెలంగాణ మన వ్యవసాయం పేరిట గ్రామాల్లో రైతుచైతన్య యాత్ర నిర్వహించి రైతులకు వ్యవసాయ శాఖ, పశుసంవర్థక శాఖ, విద్యుత్ శాఖ అధికారులతో సదస్సులు నిర్వహించేవారు. అయితే ఇప్పుడు అవి కనుమరుగు అయ్యాయి. రైతులు మార్కెట్లో నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి పంట మార్పిడి చేసుకోక, భూసార పరీక్షలు చేసుకోక నష్టపోయిన దాఖలు ఉన్నాయి. గత ఏడాది తలమడుగు మండలంలో పెద్ద ఎత్తున నకిలీ పత్తి విత్తనాలు నాటి, అవి మొలకెత్తక దాదాపు 200 ఎకరాలలో పంటలు నష్టపోవడం జరిగింది. నకిలీ విత్తనాలు మొలకెత్తక ఇతర పంట సాగు చేసుకోవాల్సి వచ్చింది. రైతుచైతన్య యాత్ర నిర్వహించి నకిలీ విత్తనాలు ఎలా గుర్తించాలో, వాటిపై అవగాహన కల్పించకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఇకనైనా వ్యవసాయాధికారులు, ప్రభుత్వం గ్రామాల్లో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి రైతులను చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది.

ఆదివాసీ గూడేల్లో 'కప్పతల్లి'



బోథ్: రోకలికి కప్పను కట్టి ఇంటింటికీ తిరుగుతున్న చిన్నారులు

ఇచ్చోడ/బోథ్/తాంసి: ఆదివాసీ గ్రామాల్లో గురువారం కప్పతల్లి ఆటను ఘనంగా నిర్వహించారు. రోహిణి కార్తెకు ముందు వచ్చే అమవాస్య రోజు ఈ పండుగ జరుపుకుంటారు. గురువారం ఇచ్చోడ మండలంలోని మల్యాల్ ఆదివాసీ గూడెంలో, బోథ్ మండలంలోని పార్డి(కె) గ్రామంలో, తాంసి మండలంలోని అంబుగాం గ్రామంలో, నేరడిగొండ మండలంలోని గాజిలిలో కప్పకు ప్రత్యేక పూజలు చేసి ఊరేగించారు. సకాలంలో వర్షాలు కురియాలని, పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు. ఏటా కప్పతల్లి ఆడి గ్రామదేవతలకు పూజలు చేస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.



తాంసి: అంబుగాంలో కప్పతల్లి ఆట



ఇచ్చోడ: మల్యాల్ గూడెంలో..

నత్తనడకన భవన నిర్మాణ పనులు



పూర్తి కాని డార్మెంటరీ భవన నిర్మాణ పనులు

నార్నూర్: నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు మండల కేంద్రంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు 480 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రస్తుతం బాలురు 285, బాలికలు 178 మంది విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు కార్పొరేట్ విద్యకు ధీటుగా అన్నిరకాల మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. ఐదు కోట్ల రూపాయలు నిధులను మంజూరు చేసింది. ఈ నిధుల ద్వారా డార్మెంటరీ భవనం, డైనింగ్ హాల్, హెల్త్ క్లీనింగ్ సెంటర్, ప్రహారీ నిర్మించాల్సి ఉంది. టెండర్ ప్రక్రియ పనులు ప్రారంభించి మూడేళ్లు అవుతున్నా.. ఇంకా పనులు పూర్తికాలేదు. దీంతో విద్యార్థినులు ఉపాధ్యాయులకు నివాస గృహాలను డార్మెంటరీలుగా వాడుకుంటున్నారు. ఒక్కొక్క గదిలో దాదాపు 30 నుంచి 40 మంది ఉంటున్నారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని పాఠశాల సిబ్బంది కోరుతున్నా.. నిధులు కొరత కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. జూలై 1 నుంచి పూర్తిస్థాయిలో పాఠశాల ప్రారంభం కావడంతో వచ్చే విద్యార్థులను ఎక్కడ ఉంచాలో తెలియక పాఠశాల సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. పనులు వేగవంతంగా పూర్తి చేయించాల్సిన ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కోరుతున్నారు.

డ్రెయినేజీ పనులు పరిశీలన

ఖానాపూర్: పట్టణంలోని ఐదో వార్డు పరిధిలో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులను గురువారం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం పరిశీలించారు. బస్టాండ్ సమీపంలోని ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ పేర్కొన్నారు. అనంతరం విద్యానగర్ కాలనీలో భగీరథ నీరు రాకపోవడంతో వాటర్‌ట్యాంక్ వద్ద నూతన గేట్‌వాల్ ఏర్పాటు చేయించి నీటి సరఫరా పునరుద్ధరించారు. కార్యక్రమంలో కమిషనర్ మనోహర్, కౌన్సిలర్ పరిమి లత సురేశ్, నాయకులు జన్నారపు శంకర్, షబ్బీర్‌పాషా తదితరులు ఉన్నారు.

రాజేశ్వరరావు ఆశయాలు సాధించాలి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఎదులాపురం: స్వాతంత్ర్య సమరయోధులు, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు ఆశయాలను సాధించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం రాజేశ్వర్‌రావు 110వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ప్రజా ఉద్యమం, స్వాతంత్ర్య పోరాటం, తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని అనేకసార్లు జైలుకు సైతం వెళ్లారని గుర్తు చేశారు. ఆయన బాటలో పయనించాలని కోరారు. కార్యక్రమంలో నళినీరెడ్డి, కుంటాల రాములు, అరుణ్‌కుమార్, రమేశ్, గణేశ్, రాందాస్, షేక్ పాషా, నర్సింగ్‌రావు, పొచ్చిరాం పాల్గొన్నారు.

తాంసి మండలంలో భారీ వర్షం



చేలలో నిలిచిన వర్షపునీరు

తాంసి: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. తాంసి, గిరిగాం, అంబుగాం, వామన్‌నగర్, వడ్డాడి, కప్పర్ల, పాలోది గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దాదాపుగా అరగంటకు పైగా కురిసిన వర్షానికి పంటచేల్లో నీరు నిలిచింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు భారీ వర్షం కురియడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు విత్తుకునేందుకు సన్నద్ధం అవుతున్నారు.